www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నాగిరెడ్డిపల్లి విద్యార్థి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీ కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడు. విద్యార్థి ప్రతి చూపేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీ విశేషమైన కృషి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి, ఇతర ఉపాధ్యాయులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి ఉమర్ ఉస్మాన్ అలీని, వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీని అభినందించారు.

అలీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. పుల్లంపేట, ఓబులవారిపల్లె ఎంపిడిఒ కార్యాలయాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులు, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలు, రెవెన్యూ సమస్యలు, ఎన్టీఆర్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు ఇచ్చిన సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులను ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడిల జనరేషన్‌కు సంబంధించి మాట్లాడుతూ ఎంఇఒలు, ఎంపిడిఒలు సమన్వయంతో త్వరగా జనరేట్ చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ హౌసింగ్ శాఖ, ఎంపిడిఒలు సమన్వయం చేసుకొని పురోగతి సాధించాలన్నారు. సమీక్ష అనంతరం పుల్లంపేట మండలం, దేవసముద్రం గ్రామం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఒక భూ సమస్య పరిష్కారం కోసం రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, పుల్లంపేట తహశీల్దార్లతో కలిసి సమస్య క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అధికారులకు తగు సూచనలను చేశారు. ఈ సమీక్ష సమావేశాలలో రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ లీలారాణి, పుల్లంపేట తహశీల్దార్ అరవింద కిషోర్, ఎంపిడిఒ జయశ్రీ, మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్ రాజు, నాగాతిరుమలరావు, భూ సర్వే శాఖ ఎడి భరత్, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

దేవసముద్రంలో భూ సమస్యపై రైతులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'ఆశా'లకు సంబంధం లేని పనులు కేటాయించొద్దు

- సిటిఎం డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- ధర్నాలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆశా వర్కర్స్‌కు సంబంధం లేని పనులు చేయించడమే కాకుండా, ఆశా కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్న సిటిఎం పిహెచ్‌సి డాక్టర్ ఝాన్సీలక్ష్మి, సిహెచ్‌ఒ అరుణ, సూపర్ వైజర్ సుమతిలపై చర్యలు తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు రోజువారీ ఎపి విభాగంలో డ్యూటీలు వేయడం, వారికి సంబంధం లేని పనులు చేపించడం, వేధింపులకు పాల్పడటం లాంటి చర్యలకు నిరసనగా మంగళవారం పిహెచ్‌సి ముందు ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఒపి డ్యూటీ రద్దు చేయాలని, వేధింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని, ఆశావర్కర్స్‌కు పనిభారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆన్‌లైన్ వర్క్స్ భారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ లేదా రికార్డ్స్ వర్క్స్ ఏదైనా ఒకపని ఒక్కసారి మాత్రమే చేయించాలని, అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు ధర్నాకు హాజరైతే మెమోలు ఇస్తామని అధికారులు బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు. 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని, సిబ్బంది. చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి, వేధించి ఆశాలతో చేయిస్తున్నారని అందులో భాగంగానే పిహెచ్‌సిలో ఒపి డ్యూటీలు చేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వర్క్స్‌తో పాటు సొంత డబ్బులుతో 26 రకాల రికార్డ్స్ కొని రాయాలని హింసిస్తున్నారని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలలో రోజంతా కూర్చోబెట్టడం, రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని, మిగిలిన సమయంలో ఫీల్డ్‌లోకి వెళ్లాలని ఎన్‌హెచ్‌ఎం నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తూ ఆశాలను తీవ్రమైన ఒత్తిడికి అధికారులు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో అడ్డమైన చాకిరీ చేయిస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడికి తట్టుకోలేక ఆశా వర్కర్స్ తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వ సెలవులు లేని కారణంగా ఆశావర్కర్‌కు ఒక్కరోజు లేదా ఒక గంట పర్మిషన్ కోసం అధికారులు దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. సచివాలయాలు, ఉప కేంద్రాలలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోబెట్టడం ఆపాలని, రిజిస్టర్‌లో ప్రతిరోజు సంతకాలు చేయటం ఆపాలని, పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లెప్రసీ సర్వేకు చెల్లించాల్సిన పారితోషికాలు మూడేళ్లుగా బకాయిలు ఉన్నా అధికారులు పట్టించుకోలేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు న్యాయం చెయ్యకపోతే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ విమలకృప వివరణ ఇస్తూ ఆశాలకు ఒపి డ్యూటీలు వేయడం పొరపాటని, గతంలో అలా చేసినందుకు క్షమాపణలు చెబుతూ ఇక నుంచి వేయమని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రామామణి, గాయత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతీ, బాలకుమారి, జానకి, నిర్మల పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఆశాలకు క్షమాపణలు చెబుతున్న డాక్టర్ విమల

అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, టెలిగ్రాం, తదితర సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని ఉమ్మడి జిల్లాల ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా, వ్యక్తిగత పేరుపైన ఫొటోలు మార్ఫింగ్ చేసినా, మాన అభిమానాలు దెబ్బ తినే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, మతపరమైన, సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రత లకు భంగం కలిగించేలా వ్యవహరించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. అవాస్తవ ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్ల పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే అనర్థలను గుర్తించాలన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు ఎట్టిపరిస్థితుల్లో పెట్టవద్దని తెలిపారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెడితే సహించబోమన్నారు. సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. పోస్టు పెట్టేటపుడు ఇతరుల మతాలు, కులాలు, మనోభావాలకు, వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించకుండా ఉండాలన్నారు. సోషల్ మీడియాను పాజిటివ్ విషయాలను విస్తృతం చేసేందుకు, దూర ప్రాంతాల్లో ఉన్న మిత్రులు, బంధువులను దగ్గరి చేర్చే విధంగా వినియోగించుకోవాలని కోరారు. చాలామంది యువత సోషల్ మీడియాకు అలవాటు పడి, సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలనే లక్ష్యంతో ఫేక్ అకౌంట్స్ ప్రారంభించి, అనుచిత పోస్టులు పెట్టి, చట్టాన్ని అతిక్రమిస్తున్నారన్నారు. తమ విలువైన సమయాన్ని వృథా చేసుకొంటూ, లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. యువత, ప్రజలు సోషల్ మీడియాను పాజిటివ్ కోణంలో వినియోగించుకోవాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు.

ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

లక్ష్య సాధనకు బాధ్యతాయుతంగా కృషి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, సిద్ధాంతాల మేరకు ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. గత ఆగస్టులో విజయవాడలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా నిర్దేశించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలు, ప్రస్తుత స్థితి, సమస్యలు, వాటి పరిష్కారాలు తదితరాలలో తీసుకున్న కార్యాచరణలపై అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా వ్యవసాయం, పశు సంవర్ధకం, హార్టికల్చర్, సెరికల్చర్, మత్స్య సంపద, అటవీ, మైనింగ్, జలవనరులు, పరిశ్రమలు, ఎపి ఎల్ ఎల్ సి, ఎపి ఎస్‌పిడిసిఎల్, రోడ్లు భవనాలు, హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్య తదితర శాఖల లక్ష్యాలను అధికారులతో సమీక్షించి చేపట్టాల్సిన కార్యాచరణ పై దిశానిర్దేశం చేశారు. ఈనెలాఖరులోగా జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించే అవకాశం ఉన్నందున ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలు, తీసుకున్న చర్య, ప్రస్తుత స్థితి పై సమగ్ర నివేదికలు రూపొందించి సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సిపిఒ వెంకట పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాజాతా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

15 నుంచి ఎల్ఐసి కళాజాతా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈనెల 15న పట్టణంలోని బంగ్లా సర్కిల్‌లో 'ప్రజాధనం ప్రజా వినియోగం కోసం' అనే నినాదంతో ఎల్ఐసి విశిష్టతను, ప్రభుత్వ రంగాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసే కళాజాతను నిర్వహించనున్నట్లు ఎల్ఐసి యూనియన్ రాయచోటి బ్రాంచ్ అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు కె.విశ్వనాథ్, డి.ఆది నారాయణరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ పేర్కొన్నారు. ఈ నెల 16 నుండి 19 వరకు బెంగుళూరు నగరంలో నిర్వహించే సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 13వ మహాసభల సందర్భంగా నిర్వహించనున్నామని చెప్పారు. మంగళవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో కళాజాతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కీలకమైన విద్యా, వైద్యం, రవాణా, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వే, విద్యుత్ లాంటి ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను కొంతమంది ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని చూస్తోందన్నారు. అనేక రూపాల్లో ఎల్ఐసి యూనియన్ ఇతర ప్రజా సంఘాలతో కలసి అనేక ఐక్య ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూ, దేశ ఆర్థిక రంగాన్ని ప్రజా సంక్షేమాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఐలిస సంఘం నాయకులు గిరిధర్, సుధాకర్ రెడ్డి చక్రవర్తి, కళ్యాణ్, సువర్ణ, వైష్ణవి, సిఐటియు నాయకులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

సహకార వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్లను సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వారోత్సవాలు నవంబర్ ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. 14 న సహకార మంత్రిత్వ శాఖ కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాల బలోపేతం ,15 న సహకార సంఘాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16 న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17 న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజనత సంస్థలుగా రూపాంతరం, 18 న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ఉచిత మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- రాయచోటి

అపార్ ఐడి నమోదు కోసం జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పై ఒత్తిడి తగ్గించాలని యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, షేక్ జాబిర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆధార్‌లో సవరణల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎలాంటి రుసువం వసూలు చేయకుండా ఉచితంగా ఆధార్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పలు చోట్ల ఆధార్ కేంద్రాల వారు సిండికేట్‌గా ఏర్పడి ఆధార్‌లో సవరణల కోసం మూడు 3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నోటరి ఇతర డాక్యుమెంట్లు లేకుండానే జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. అపార్ ఐడి నమోదుకు ఆధార్ కార్డు లింకు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పాఠశాల రికార్డుల ప్రకారం యుడైస్ వివరాల నమోదు ప్రకారం అవకాశం కల్పించి ఉంటే ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పేవని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం అంతర్జాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

రహదారి భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రహదారి భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని వాహనదారులకు ఎంవిఐ శివలింగయ్య సూచించారు. మంగళవారం బెంగళూరు రోడ్డులో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఉపయోగించాలని, వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లా డకూడదని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఆర్టీఓ కార్యాలయం ద్వారా పలుమార్లు అవగాహన కల్పించడాన్ని గుర్తు చేశారు.

నిబంధనలు తప్పక పాటించాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలోని ఆసుపత్రి యాజమాన్యలు తప్పకుండా నిబంధనలు పాటించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం అయన మీడియతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలు, ప్రజల ఫిర్యాదుల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లగించి నట్లయితే ఆంధ్రప్రదేశ్ మెడికల్, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయివేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లలో అగ్నిమాపక కార్యాలయం నుంచి అనుమతులు పొందాలని చెప్పారు. మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ ప్లాన్ సంబంధిత పత్రాలు ఉంచుకోవాలని అన్నారు. నమోదు పత్రంలో నర్సింగ్ చేసిన సిబ్బంది పేర్లు నమోదు చేయాలని అన్నారు. కాలుష్యం నియంత్రణ బోర్డు నుంచి కాలుష్య రహిత అనుమతి ఉండాలని అన్నారు. పలు ఆసుపత్రులు, క్లినిక్స్ నిర్వహణ కాల పరిమితి ముగిసినప్పటికీ రెన్యువల్ చేయించుకోకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. అలాంటి వాటిపై కొరడా ఝుళిపించేందుకు వైద్య ఆరోగ్యశాఖ రంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్, రెన్యువల్స్, కాల పరిమితి ఉన్నప్పటికిని నిబంధనలు పాటించడం లేదని తెలిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రతి ఆస్పత్రిలోని డయాగ్నొస్టిక్ సెంటర్లలో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు, వార్డుకు, రూమ్ రెంట్, ఆపరేషన్, వైద్యుల వివరాలు తదితర వివరాలు ధరలు ప్రకటించి బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆస్పత్రికి తనిఖీలకు వెళ్లిన సమయంలో అధికారులు పరిశీలించిన తర్వాతనే ఆసుపత్రులకు అనుమతి మంజూరు చేస్తామని, నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న కొండయ్య

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాపోరును జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 14న రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ళ మణి పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేటలో ప్రజాపోరుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 8 నుంచి చేపడుతున్న ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా 14 ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి అమలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, ఉద్యోగుల తొలగింపు విరమించాలని, మహిళలు, మైనారిటీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని, పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ, పరిహారం ఇచ్చి ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేక జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా ధర్నా చేప్టామని తెలిపారు. కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఎం.మల్లి, ఆర్.రమేష్ రెడ్డి, కె.నాని, కె.రమణ, ఎస్.సాధిక్ బాషా, ఎం.వెంకటయ్య పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్

ప్రజాశక్తి-గాలివీడు : పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతుంది. వాహనాల సంఖ్య అధికం కావడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. నాలుగువైపులా సిసి రోడ్లు వేసినా వాహనాలు ఒక వైపు రహదారికే పరిమితమతుంది. ఎక్కడ నిలిచిన వాహనాలు అక్కడే ఉంటున్నాయి. చిల్లరు దుకాఖాలు వద్ద వాహన రాకపోకలు అధికం కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. బస్టాండు గేటు కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు చాలా రద్దీగా ఉంటుంది. పైగా బుధ, గురువారాలు సంత రోజుల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు మండలకేంద్రానికి రావడం, వాహనాల రాకపోకలు అధికం కావడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు ఈ రెండు రోజులు విధుల నిర్వహణలో బేజారవుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలోని ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అవసరమెంతైనా ఉంది.

రోడ్డుపై వాహనాలు నిలపడంతో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య

'వర్రా'కు 14 రోజుల రిమాండ్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- సజ్జల భార్గవ్‌రెడ్డికి లుక్ అవుట్ నోటీసులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డికి రెండవ ఎడిజెఎం జడ్జి 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం సాయంత్రం వర్రా రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ఉదయ్‌లను మీడియా ఎదుట హాజరు పరిచిన అనంతరం అర్ధరాత్రి సమయంలో రెండవ జెడిఎం జడ్జి దగ్గర హాజరు పరిచిన సందర్భంగా వర్రా రవీంద్రారెడ్డి పోలీసులు టార్చర్ చేశారని, శరీరంపై ఏర్పడిన గాయాలను జడ్జికి చూపించి నట్లు తెలిసింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన పిఎ ప్రోద్బలంతోనే వైఎస్ షర్మిల, సునీతలపై పోస్టులు చేశానని చెప్పాలంటూ ఒత్తిడి చేశారని, దీనికి ఒప్పుకోకపోవడంతో టార్చర్ చేశారని, మేం ఏమి చెప్పినా ఎస్ అనాలని వీడియా రికార్డు చేశారని వాపోయినట్లు సమాచారం. జడ్జి అతని వాదనల్ని రికార్డు చేసినట్లు తెలిసింది. పోలీసులు తయారు చేసిన రిమాండ్ రిపోర్టులో సజ్జల భార్గవరెడ్డి, కడప జిల్లా సోషల్ మీడియా బాధ్యులు వివేక్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం అనుచిత పోస్టులు పెట్టామని పేర్కొన్నట్లు తెలిసింది.

'సజ్జల'కు లుక్ అవుట్ నోటీసులు

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంలో కీలకపాత్ర పోషించిన అనుమానితులు సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి సహ పలువురిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. 2020 నుంచి సోషల్ మీడియాలో రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులపై అనుచిత పోస్టులు పెట్టిన కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ముందుజాగ్రత్త చర్యగా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 8న పులివెందులలో వర్రా రవీందర్‌రెడ్డితో పాటు సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో భార్గవ్‌రెడ్డిపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. విదేశాలకు పారిపోతారనే అనుమానంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. వర్రా రవీందర్‌రెడ్డి వాంగ్మూలంతో వీరిద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



వర్రా రవీందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి

ఆక్రమణలు తొలగింపునకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలో అతిపెద్ద సమస్య అయిన ప్రధాన రహదారుల ఆక్రమణలు, మురుగు కాలువలపై షాప్ బంకులు నిర్మాణం, హోటల్ నిర్వాహకులు వంట చేసే సామగ్రిని ఉంచి పనులు చేసుకుంటున్నారు. పార్కింగ్ చేయవలసిన స్థలాన్ని అంత ఆక్రమించుకున్నారని, పార్కింగ్ చేయవలసి వస్తే బైకులు రోడ్డుపైకి వస్తున్నాయని ఈ ఆక్రమణలతో ట్రాఫిక్ ఇబ్బందులు చాలా వస్తున్నాయని, పది నిమిషాలకు ఒకసారి వందలాది వాహనాలు ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారని, కనీసం అత్యవసర సేవలైన 108 కూడా ఈ ట్రాఫిక్ సమస్యలో ఇరుక్కుపోయిన పరిస్థితి వస్తుండడంతో నగర పంచాయతీగా అభివృద్ధి చెందిన కూడా ట్రాఫిక్ సమస్యపై అధికారులు చర్యలకు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం కాలువలపై ఆక్రమించుకొని వారికి ఆ క్రమంలో తొలగించుకోవాలని లేనియెడల బుధవారం జెసిపితో ఆక్రమణ తొలగించడానికి రంగం సిద్ధం చేసిన నగర పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులు ఆక్రమంలో తొలగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ జివి.పల్లవి, సిఐ రాజారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైతే కాలువలపై ఆక్రమించుకున్న వారి స్వచ్ఛందంగా తొలగించుకోని యెడల జెసిబిలతో తొలగిస్తామని అధికారులు, పోలీస్ సిబ్బంది హెచ్చరించారు. పట్టణంలోని రంగసముద్రం రోడ్డు, పిటిఎం రోడ్డు, బెంగళూరు రోడ్డు, మదనపల్లి రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని తెలిపారు. గతంలో అనేక సార్లు ఈ విధంగా ఆక్రమణలను తొలగించాలని ఎన్నిసార్లు హెచ్చరించినా ఆక్రమణదారులు బేఖాతరు చేసిన సంగతి విధితమే. గతంలో అనేకసార్లు మార్క్ వేసి అక్రమణలు తొలగించాలని హెచ్చరించినా అలాగే ఉంచిన వాటిని తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.వి.పల్లవి, సిఐ రాజారెడ్డి, ఎఎస్ఐ బొజ్జా నాయక్ నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ రమాదేవి, కానిస్టేబుల్ నాగేంద్ర, మారుతి పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

గాయమైన విద్యార్థి చేయి చూపిస్తున్న తల్లి

విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టడంతో ఏర్పడిన గాయం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విగ్నేష్‌ను అల్లరి చేశాడని ఉపాధ్యా యుడు లోకేష్ వాతలు వచ్చేలా కొట్టాడు. విద్యార్థికి చేతులు, వీపుపై దద్దులు వచ్చేలా చితకబాదాడు. ఉదయం పాఠశాలలో జరిగిన సంఘటనను విద్యార్థి సాయంత్రం దిగువ గొల్లవాండ్లపల్లెలోని ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు మంగళవారం రాత్రి పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుని ఇక్కడికి రప్పించాలంటూ నివాదాల చేశారు. గతంలో విద్యార్థి చేతికి రాడ్డు కూడా అమర్చడం జరిగిందని, ఆ చేతి పైనే ఉపాధ్యాయుడు కొట్టడంతో పాఠశాలల్లోనే స్పాహ తప్పి పడిపోయాడని వారు వాపోయారు. నా బిడ్డ అంత తప్పు ఏమి చేశాడని, ఉపాధ్యాయుడు ఎందుకు కొట్టాడని మాకు సమాధానం చెప్పాలని, అంతవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ విద్యార్థు తల్లిదండ్రులు పట్టుపట్టారు. దీనిపైన ఉన్నతాధికారులు స్పందించి అతనిపైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్య లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు.

'విద్యార్థి మృతిపై అనుమానాలు పోలీసులే నివృత్తి చేయాలి'

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లా, కెవి పల్లి మండలం, గ్యారంపల్లె గురుకుల పాఠశాల విద్యార్థి రెడ్డి మోక్షిత్ మృతిపై తలెత్తిన రకరకాల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులదే అని పౌర హక్కుల సంఘం తెలిపింది. ఈనెల 10వ తేదీన గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి రెడ్డి మోక్షిత్ మృతి పలు అనుమానాలకు దారి తీసిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి కడప జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా కమిటీ గ్యారంపల్లి గురుకుల పాఠశాలకు చేరుకుని సంఘటన ప్రాంతాన్ని, స్కూలు సిబ్బందిని, విద్యార్థి తల్లిదండ్రులను, పోస్ట్ మార్టం చేసిన డాక్టర్ ను కెవి పల్లె పోలీసులను కలసి పలు వివరాలను సేకరించారు. ఈ సందరరేగా వారు తెలియజేసిన వాస్తవ వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 10న ఉదయం పాఠశాల డార్మెంటరీలో విద్యార్థులందరూ అల్పాహారం కోసం మెస్‌కి వెళ్ళిన సందరరేలో 5వ తరగతి కి సంబంధించిన డార్మిట రీలోని రెడ్డి మోక్షిత్ తన నాలుగు అడుగుల ఎత్తున్న డబల్ డెక్కర్ మంచానికి టవల్తో ఉరి వేసుకున్నాడని కొందరు విద్యార్థులు చూసి ఉపాధ్యాయులకు చెప్పగా ఉపా ధ్యాయులు వచ్చి చూసి అప్పటికే పిల్లవాడు అపస్మారక స్థితిలో ఉన్నాడని, ప్రాణాలు కాపాడేందుకు వార్డను, మరికొందరు ఉపాధ్యాయులు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారన్నారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని ధ్రువీకరించినట్లు ఉపాధ్యాయులు తమ కమిటీ దృష్టికి తెచ్చారని చెప్పారు. సంఘటన జరిగిన ముందు రోజు సెటిల్ బ్యాట్ విషయమై తన సహ విద్యార్థితో వాదన జరిగిందని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని, బ్యాట్ విరిగిన దానికి పరిహారంగా సహ విద్యార్థి రూ.300లు ఇమ్మన్నాడని, దానికి తన వద్ద ఉన్న రూ.100 ఇచ్చాడని, మిగిలిన రూ.200లు తన తల్లి వచ్చినప్పుడు తీసిస్తానని చెప్పాడని తెలిసిందన్నారు. అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులు రెడ్డి మోక్షిత్ మంచి తెలివైన విద్యార్థి అని, ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు గాడని తన పని తను చూసుకునేవాడని చదువులో ముందుండేవాడని చెప్పారు. తల్లిదండ్రులను తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులో కలసి మాట్లాడడం జరిగిందన్నారు. విద్యార్థి తల్లి వాణి తన కొడుకుకు ఈ వయసులో ఆత్మహత్య చేసుకునే ఆలోచన, కష్టం ఏం వచ్చిందో మాకు తెలియడం లేదని, నాలడుగులున్న మంచానికి ఉరి వేసుకొని కాళ్ళు నేలకు ఆనుకొని ఉన్నాయని, అలాంటి స్థితిలో చనిపోవడం అసాధ్యమని, నా కుమారుని మృతి వెనక ఎన్నో అనుమానాలున్నాయని ఆమె కమిటీ ముందు ఆవేదన వ్యక్తం చేసిందని తెలియజేశారు. చిన్న వయసులో పిల్లల మధ్య వైరాలు, వైశ్యామ్యాలు ఉండవని, చిన్నచిన్న గిల్లికజ్జాలు తప్ప వేరే ఉద్దేశాలు ఉండవన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు అని అన్నారు. అయితే నాలుగడుగుల ఎత్తున్న మంచానికి ఉరివేసుకొని మరణించాడంటే నమ్మశక్యంగా లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేసి విద్యార్థి తల్లిదండ్రులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులకుందని, అయితే గురుకుల పాఠశాలలోని విద్యార్థుల సంరక్షణ బాధ్యత స్కూలు సిబ్బందిదే అని, వారి నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగిందని పౌర హక్కుల సంఘం భావిస్తోందన్నారు. స్కూల్ సిబ్బందే విద్యార్థి మ ృతికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నామని, ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థి మరణంతో కృంగిపోయిన పేదలైన రెడ్డి మోక్షిత్ తల్లిదండ్రులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచూర్ రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రెడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగిమల్ల రమణయ్య పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న పౌర హక్కుల సంఘం కమిటీ

గ్రామసభలతోనే భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల పరిధిలో కుర్నూతుల అగ్రహారం సచివాలయంలో మంగళవారం గ్రామసభ రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి, భూ సమస్యలు ఉన్నవారి నుండి రెవెన్యూ అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్నటువంటి రీ సర్వేలను తప్పులను, జాయింట్ నెంబర్లను, మీ దగ్గరికి రెవెన్యూ సిబ్బంది సర్వేయర్‌తో కలిసి మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. మండల యువ నాయ కుడు యనమల మదనమోహన్ మాట్లాడుతూ గ్రామాలలో భూమి సర్వే సమయంలో భూమి కొలతలు తక్కువగా అన్న, ఒకరు భూమి మరొకరికి పోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అలాంటి సమస్య పరిష్కారం కోసమే గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి సమస్య ఉన్నవారు గ్రామసభలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలిపారు. గ్రామ సభలో మదనమోహన్ అధికారులతో మాట్లాడుతూ గ్రామ సభలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ప్రజలు భూ సమస్యల కొరకు ఎంతో ప్రయాసతో అధికారులు వద్దకు వస్తారని వారి సమస్యను సావిదానంగా విని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు, మండల సర్వేయర్ మదన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు,తెలుగుదేశం పార్టీ నాయకులు రామాంజనేయులు, ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్, వెంకటరామిరెడ్డి, రమణ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఆర్థిక ప్రణాళికపై శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, విఒఎలకు, పిఆర్, ఆర్డబ్ల్యుఎస్, హౌసింగ్ సంబంధిత ఎఇలకు, ఎపిఎం, ఎపిఒ, వెటర్నటి డాక్టర్, పిహెచ్‌సి డాక్టర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అగ్రికల్చరల్ ఆఫీసర్, మండల అధికారులు అందరూ బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడిఒ సభ భవనంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపిడిఒ, జడ్‌పిటిసి తెలిపారు. ప్రతి ఒక్క అధికారి తప్పకుండా హాజరుకావాలని తెలియజేశారు. సభకు హాజరయ్యేటప్పుడు ప్రతి ఒక్కరూ తమ వెంట ఆధార్ కార్డును తీసుకురావాల్సినంతగా తెలియజేశారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి పార్టీల గెలుపు కోసం చేనేతల ఓట్లు వేయించుకుని బడ్జెట్‌లో చేనేత కార్మికులకు మొండిచేయి చూపారని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రూ.2,94,427 కోట్ల బడ్జెట్లో చేనేత పేరే లేకపోవడం అన్యాయ మన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత రంగానికి 300 యూ నిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. చేనేత రంగం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చి, బడ్జెట్లో కనీసం చేనేత పేరైనా ఎత్తకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె క్లస్టర్ పరిధిలోని మదనపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ఎపిడి గోకులం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిడి మధుబాబు పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లి పట్టణంలోని సిఎల్‌ఆర్‌సి భవనంలో గోకులం షెడ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో కల్పించిన గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేసి తద్వారా పశు పోషణాభివృద్ధితో పాలను డెయిరీలకు విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి పొందాలని ఆకాంక్షించారు. రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా రాయితీతో కల్పించిన షెడ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా పూర్తి చేయకపోతే ప్రభుత్వం ఇచ్చే రాయితీ రద్దవుతుందని హెచ్చరించారు. కావున రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాయితీ షెడ్లను నిర్మించుకొని, తద్వారా ఆర్థిక అభివృద్ధి పొందాలని తెలియజేశారు. సమావేశంలో మదనపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి మధుబాబు

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

గొల్లపల్లిలో జోరుగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లిలో జోరుగా అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గుండ్లబురుజు గొల్లపల్లిలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంతో పాటు, గొర్రెలు, మేకలు, పాడిఆవుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇక్కడి ప్రజలకు సరైన మురుగునీటి కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొద్దిపాటి వర్షం పడిన నీరు బయటకు వెళ్లలేక ఎక్కడికక్కడ నిలిచిపోవడం జరుగుతూ ఉండేదన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాచవేటివారిపల్లె పంచాయతీలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాష పర్యటించి గ్రామంలో పలుచోట్ల సిసి రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గొల్లపల్లెలో రూ.5 లక్షలు నిధులను వెచ్చించి 156 మీటర్ల పొడవునా మురుగునీటి కాలువను నిర్మించడానికి పనులను ప్రారంభించామని తెలిపారు. తద్వారా పల్లెలోని మురుగునీరు, వర్షపు నీరు పల్లె బయటకు పోవడానికి అవకాశం కలుగుతుందని, దీనితో ప్రజల సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కొరముట్ల శ్రీనివాసులు

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులును ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 నుంచి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొరముట్ల గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నుంచి ఆ కుటుంబానికి కొరముట్ల వీర విధేయుడుగా ఉన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సభ భవనంలో మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కి రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో జరిగిన నిధుల అక్రమాలపై రొంపిచర్ల మురళి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి తక్షణమే రిపోర్టు సమర్పించాలని సంబంధిత అధికారి డిఎల్‌డిఒకు ఆదేశించారు.

అత్తా ఉల్లాను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్

అత్తా ఉల్లాను సన్మానించిన కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాపై అవగాహన కల్పిస్తూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్న అమానత్ సేవా సొసైటీ వ్యవస్థపలకు అత్తా ఉల్లాను గుర్తించి అన్నమయ్య కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితులలో పేదలకు రోజూ భోజనాలు అందించారని, పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం వేల రూపాయలు సహాయం చేసిన వ్యక్తి అని కొనియాడారు. కొన్ని వందల మంది యువకుల చేత రక్తదానం చేయించి ఆపదలో ఉన్న వారికి రక్తం అందించారని అన్నారు. విజయవాడ వదల్లో వర్షానికి సైతం లెక్క చేయకుండా అక్కడి ప్రజకు ఆహారం, బట్టలు, నిత్యావసర వస్తువులు అందించారని అన్నారు. ప్రజా సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటాడని గుర్తు చేశారు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రజేంద్రన్, రవాణా శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంక్ ఏజెంట్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నిందితుడు గిరిప్రసాద్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

బ్యాంకు రుణాలు చెల్లింపుల ఎగవేత కేసు రుజువు కావడంతో ఏజెంట్ గిరిప్రసాద్ (30) అనే నిందితుడికి రూ.10వేలు జరిమానాతో పాటు ఐదేళ్ల శిక్ష విధిస్తూ మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి గురు అరవింద్ తీర్పు నిచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఎస్సై చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు.. 2014 ఏడాదికి ముందు వాల్మీకిపురం సొసైటీ బ్యాంకు నందు వ్యవసాయ రుణాలు పొందిన 17 మంది రైతుల రుణాలు చెల్లించే క్రమంలో బ్యాంక్ ఏజెంట్ గిరిప్రసాద్‌కు రుణ కంతులు చెల్లించారు. అయితే రైతులు చెల్లించిన కంతులను ఏజెంట్ బ్యాంకుకు చెల్లించకుండా సొంత ఖర్చులకు వాడుకోవడంతో రైతులకు రుణాలు చెల్లించలేదంటూ బ్యాంకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. దీంతో రైతుల ఫిర్యాదు మేరకు ఏజెంట్ గిరిప్రసాద్‌పై అప్పటి ఎస్ఐ పరశురాం కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం నిజానిజాలు నిర్ధారణ కావడంతో నింధితుడు గిరిప్రసాదకు జరిమానాతో పాటు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

మహారాజశ్రీ ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు : రాయచోటి
A.S.No. 15/2023
మజ్జిగ జయరామిరెడ్డి, S/o లేట్ కొండారెడ్డి, వయస్సు 60 సం॥లు, మజ్జిగవాండ్లపల్లి (గ్రామం), రామాపురం (మం॥), అన్నమయ్య జిల్లా మరియు ఇంకొకరు.
...అప్పిలెంట్లు
Vs
R-7 మజ్జిగ విశ్వనాథరెడ్డి,S/o శేషారెడ్డి, వయస్సు 32 సం॥, ఎంప్లాయ్, R/o మజ్జిగవాండ్లపల్లె (గ్రా॥), H/o చిట్లూరు, రామాపురం (మం॥), అన్నమయ్య జిల్లా.
...ఏడవ రెస్పాండెంటు
నోటీసు
పై తెలిపిన అప్పిలెంట్లు మీ పైన మరియు 6 మంది పై అప్పీలు సూటు దాఖలు చేసి ఉన్నారు. సదరు అప్పీలు సూటు పైన తెలిపిన కోర్టు నందు 12.12.2024వ తేదీన వాయిదా ఉన్నందున మీరు నేరుగా గానీ లేక లాయరు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
సి.పవన్‌కుమార్ రెడ్డి, బి.కామ్.యల్.యల్.బి.,
అప్పిలెంట్స్ అడ్వకేటు,
రాయచోటి.

సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న కలకడ కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ అనిత, రైల్వేకోడూరు పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అధ్యాపకుల డాక్టర్ సయ్యద్ సదరున్నీషా

సిఎం చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-కలకడ/రైల్వేకోడూరు

విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పలువురు అవార్డు, ప్రశంసా పత్రాలు సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదర్

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి తరలిరండి

ప్రజాశక్తి-నందలూరు

డిసెంబర్ 12వ తేదీన రాజంపేటలో పార్లమెంటు స్థాయిలో నిర్వహించబోయే ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మండలంలోని విభిన్న ప్రతిభావంతులందరూ పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మంగళవారం పిలుపునిచ్చారు. మండల నూతన అధ్యక్షుడిగా అలుసూరి శివకోటిని నియమించారు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ భవిష్యత్తులో మండలంలోని విభిన్న ప్రతిభావంతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారానికి తాను ముందు ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షులు సుబ్బనరసారెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షులు ఖాదర్ బాష, సెక్రటరీ వెంకట ప్రసాద్, సభ్యులు వెంకటసుబ్బయ్య, మౌలాలి, జాకీర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

57వ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయాధికారి ఆర్.వసంత కుమారి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలను మదనపల్లె ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ రాఘవేంద్ర, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ ప్రమీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జరుగుతాయని ఇందులో భాగంగా బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహిస్తామన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ, క్విజ్, క్రీడల పోటీలు నిర్వహణ, 19వ తేదీన మహిళలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 20వతేదీన డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టిఎస్ఎ.కృష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సభ్యత్వ పత్రాన్ని ఇస్తున్న జిల్లా నాయకులు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని, ఆలస్యం, అలసత్వం లేకుండా 12వ పిఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని (ఐఆర్) ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన, రాష్ట్ర కమిటీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో వారు మాట్లా డుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా మధ్యంతర భృతిని ప్రకటించి గత పిఆర్సీకి సంబంధించిన బకాయిలను, పెండింగులో ఉన్న డిఎ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకో వాలని, ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు, పిఎఫ్‌లోన్లు,ఫైనల్ పేమెంట్లు ఆర్జిత సెలవులు నగదు చెల్లింపులు చెల్లించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జిఒ 117 రద్దు చేయాలని, 3, 4, 5వ తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మండలం అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు ఖాదర్‌వల్లి, సోమశేఖర్,డివిజన్ కన్వీనర్ రమేష్ బాబు, శివారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాల్ని వృద్ధి చేయాలి

ప్రజాశక్తి-పీలేరు : విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాల్ని వృద్ధి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు ఉందని ఎపి సాల్ట్ సమన్వయకర్త చిన్న బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం ఎంఇఒ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు ఫిర్కీ యాప్ నిర్వహణలో వారికున్న అనుమానాల నివృత్తికై సమీక్ష చేశారు. ప్రపంచ బ్యాంకు పాక్షిక సాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్సఫర్ మిషన్ (ఏపీ సాల్ట్) ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో విద్యాభివృద్ధికి, విద్యార్థులకు సులభ పద్ధతిలో గణిత శాస్త్రం బోధించడానికి ఫిర్కీ యాప్ లో కొన్ని రకాల వీడియోలు పొందుపరచడం జరిగిందని అన్నారు. వాటిని వినియోగించి బోధనా పద్ధతిలో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వై.లోకేశ్వర్ రెడ్డి, బి.పద్మావతమ్మ, సిఆర్‌పిలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, కార్యాలయ సిబ్బంది తాజూన్, శిరీష, మండలంలో టిపిడికి ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సమన్వయ కర్త బ్రహ్మయ్య